
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 7 జూలై 2025





భట్లపెనుమర్రులో నిప్పులగుండం దాటుతున్న ముస్లింలు

స్కేటింగ్ రోల్‌బాల్ క్రీడాకారుడు

శ్రీశాంత్‌కు ఘన స్వాగతం

కెన్యాలో జరిగిన పోటీల్లో విజేతగా భారత జట్టు

- విజయంలో కీలకపాత్ర పోషించిన కొండిపాలెం కుర్రాడు
- తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామానికి రాక
- ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లిన గ్రామస్థులు



మోటపర్తి శ్రీశాంత్

గుడ్లవల్లేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కెన్యా దేశంలో జరిగిన స్కేటింగ్ రోల్‌బాల్ పోటీల్లో కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు పంచాయతీ శివారు కొండిపాలెం గ్రామానికి చెందిన మోటపర్తి రేణుకరాజు మనవడు మోటపర్తి శ్రీశాంత్ భారతదేశం తరపున ఆడి భారత్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. దేశ ప్రజల మన్ననలు అందుకున్నారు. రేణుకరాజుది గ్రామంలో సాధారణ రైతు కుటుంబం. ఆయన కుమారుడు మోటపర్తి రాంబాబు సీఆర్‌పీఎఫ్‌లో చేరి చత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనకుటుంబం చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో ఉంటోంది. రాంబాబు, చైతన్య దంపతుల కుమారుడు శ్రీశాంత్ శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ కాలేజీలో ఇంటర్ చదువుకొంటూ సిల్వావాగ్రే ఉమెన్ కోచ్ వద్ద స్కేటింగ్ రోల్ బాల్‌లో శిక్షణ తీసుకున్నారు. శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ టీమ్‌కు రెండు సార్లు నేషనల్స్ ఆడి ప్రతిభ చూపి భారత జట్టుకు శ్రీశాంత్ ఎంపికయ్యారు. కాగా,

మిగతా 6లో..





● భక్తజనకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 60 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. 500 భక్త బృందాలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుమారు 13 గంటల పాటు భక్తుల తాకిడి కొనసాగింది.

● రక్తతర్పణం

మొహర్రం దుఃఖ దినాలను పురస్కరించుకుని ఆదివారం మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ముస్లింలు రక్తతర్పణం చేశారు. గిరోహె మిరన్‌షా, గిరోహె హజరత్ హుస్సేన్ దళాలు పీర్లతో ఊరేగింపు నిర్వహించాయి. హజరత్ ఇమాం హుస్సేన్ త్యాగాలను గుర్తు చేసుకున్నాయి.

6



మచిలీపట్నంలో..

మట్టి మాఫియా బరితెగింపు!

కొత్తూరు చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కొత్తూరు చెరువులో మట్టి దందాకు తెరతీసింది. రైతు పొలం మెరక పేరుతో అనుమతి తెచ్చి అడ్డగోలుగా తవ్వకాలు చేస్తోంది. ఐదు వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇస్తే ఏకంగా లక్ష క్యూబిక్ మీటర్లపైనే తవ్వేసి సొమ్ము చేసుకుంది. ప్రధానంగా ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు పెద్ద ఎత్తున రవాణా చేసింది. అక్రమ తవ్వకాలపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



- పొలం మెరక చేసుకోవాలని రైతు పేరుతో దరఖాస్తు
- 5 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి.. తవ్వింది లక్షపైనే..
- ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు పెద్ద ఎత్తున తరలింపు
- రూ. లక్షల్లో దోచుకున్న అక్రమార్కులు
- ఫిర్యాదు చేసిన గ్రామస్థులు.. పత్తాలేని అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రూరల్ మండలం పరిధిలోని కొత్తూరు చెరువు 150 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమిని మెరక చేసుకునే నిమిత్తం ఈ చెరువులోని ఆరు వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తన సొంత ఖర్చులతో తవ్వుకోవటానికి జలవనరుల శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోగా, ఐదు వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకోవటానికి అనుమతి ఇచ్చారు. జూన్ 29వ తేదీ లోపు ఈ మట్టిని తవ్వుకోవాలని స్పష్టం చేశారు. అయితే సదరు వ్యక్తి పేరుతో ఇప్పటి వరకు లక్ష క్యూబిక్ మీటర్ల మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వేశారు. గడువు దాటి పోయినా కూడా ఇంకా మట్టి తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు.

పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుగుతుండటంపై స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా ఇరిగేషన్, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవటం లేదని విమర్శలు వస్తున్నాయి. మైనింగ్ ఏడీ వీరాస్వామికి ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా ఆయన పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసే అధికారం తమకు లేదని ఇరిగేషన్ శాఖ అధికారులు అంటున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఈ రెండు శాఖల అధికారులపైనా అనేక అనుమానాలు నెలకొంటున్నాయి.

మూడు భారీ ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు

పొలం మెరక చేసుకోవటానికి అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాల కోసం మట్టిని తరలిస్తున్నారు. మూడు భారీ ఎక్స్‌కవేటర్లను పెట్టి వందలాది ట్రాక్టర్లలో రేయింబవళ్లు మట్టిని రవాణా చేస్తున్నారు. ఇటుక బట్టీలు, రియల్

మిగతా 6లో..

20 ఏళ్ల తర్వాత మోక్షం

ఏనుగులకోడు డ్రెయిన్ వంతెన పనులు ప్రారంభం

- రూ. 90 లక్షలతో వంతెన వింగ్‌వాల్స్ పునర్నిర్మాణం
- అనేక సార్లు వంతెన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు



పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్‌పై మొదలైన వంతెన వింగ్‌వాల్స్ నిర్మాణ పనులు

తోట్లవల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెన వింగ్‌వాల్స్ (పక్క గోడలు) పునర్నిర్మాణానికి బీజం పడింది. సుమారు 20 ఏళ్ల నుంచి ఎంతో ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెనపై ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చొరవతో కూటమి ప్రభుత్వం రూ.90 లక్షలు కేటాయించింది. ఈ పనులను ఆదివారం కాంట్రాక్టర్ మొదలు పెట్టారు. ఏడెనిమిది గ్రామాల ప్రజలు ఈ వంతెనపైగా ఉయ్యూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. వందల ఎకరాల్లో చెరకు పంట ఉయ్యూరు కేసీపీకి రవాణా జరుగుతూ ఉంటుంది. అయితే వంతెనకు నాలుగు పక్కల సైడ్‌వాల్స్ పూర్తిగా విరిగిపోయాయి. నేల మట్టానికి 20 అడుగుల ఎత్తులో ఉన్న వంతెనపైగా రైతులు, ప్రజలు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అనే విధంగా రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఓ ఎడ్లబండి వంతెనపై నుంచి 20 అడుగుల లోయలో పడి ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. ఇసుక బండ్లు పడిపోయాయి. 'ఆంధ్రజ్యోతి'లో అనేక పర్యాయాలు వంతెన దుస్థితిపై కథనాలు వెలువడ్డాయి. దీంతో కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చి నిధులు కేటాయించటం జరిగింది.



సుందరీకరణకు శ్రీకారం

విజయవాడ ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారి, వీఐపీ కారిడార్‌లో పనులు

అమరావతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేగవంతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ అంతర్జాతీయ విమానాశ్రయం సుందరీకరణ బాధ్యతలను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) తీసుకుంది. అలాగే ఎయిర్‌పోర్టు నుంచి వీఐపీ కారిడార్ వరకు విజయవాడ నగరం వెలుపల ఉన్న మార్గాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దనుంది. ఎయిర్‌పోర్టులో ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న గ్రీనరీపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. సుందరీకరణ బాధ్యతలను చూడాల్సిందిగా ఏడీసీఎల్ ఎండీ లక్ష్మీపార్థసారథికి సూచించారు. దీంతో ఏడీసీఎల్ అధికారులు రంగంలోకి దిగారు. విమానాశ్రయం గ్రాండ్ ఎంట్రన్స్ రోడ్డుతో పాటు విమానాశ్రయానికి అభిముఖంగా ఉన్న ప్రాంతంలో పశువైద్య కళాశాల దగ్గర ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎయిర్ పోర్టు నుంచి రామవరప్పాడు రింగు రోడ్డు వరకు ఇప్పటికే ఏడీసీఎల్ సుందరీకరణ పనులు చేపట్టింది. మొత్తం 13 కిలో మీటర్ల పరిధిలో ప్రస్తుతం ఉన్న గ్రీనరీలో చాలా చోట్ల అభివృద్ధి చేయాల్సి ఉంది. ఆకర్షణీయమైన పూల మొక్కలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధానంగా సెంట్రల్ మీడియంలో కనువిందు చేసే పూల మొక్కలు పెట్టనున్నారు. ఇటీవల ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారధి, కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ సంయుక్తంగా సుందరీకరణ అంశంపై చర్చించారు.



శాకంబరిగా తిరుపతమ్మ

6



● యాంటీ రేబిస్ టీకా

ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలను పశువైద్యులు ఆదివారం వేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు యజమానులు తీసుకువచ్చిన డాగ్స్ ఆకట్టుకున్నాయి.



చెస్ట్ బీటింగ్‌తో రక్తతర్పణం చేస్తున్న ముస్లింలు

కర్బలా మైదానాన్ని తలపించిన మాతం

- కోనేరు సెంటర్‌లో ముస్లింల రక్తతర్పణం
- హజరత్ ఇమాం హుస్సేన్ త్యాగాలు మరువలేనివి
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మొహర్రం నెల 10వ రోజున కర్బలా మైదానంలో ఇస్లాం మత ధర్మ పరిరక్షణ కోసం జరిగిన యుద్ధంలో హజరత్ ఇమాం హుస్సేన్ చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో వేలాది ముస్లిం సోదరులు చెస్ట్‌బీటింగ్ కార్యక్రమం నిర్వహించి రక్తతర్పణం చేశారు. మూడు దళాలు ర్యాలీగా వచ్చి కోనేరుసెంటర్‌లో చెస్ట్‌బీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. గిరోహె మిరన్‌షా, గిరోహె హజరత్ హుస్సేన్ దళాలు ఇనకుదురు పంజాల నుంచి పీర్లతో ఊరేగింపుగా కోనేరుసెంటర్‌కు వచ్చి చెస్ట్‌బీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పాల్గొన్నారు. ముస్లిం మహిళలు సమాధుల నమూనాలను, పల్లకీలను ఊరేగింపుగా మోసుకు వచ్చారు. ఆనాటి యుద్ధాలను జ్ఞప్తికి చేస్తూ కత్తులతో గుర్రాలు వచ్చాయి. ఈ ఏడాది వినూత్న రీతిలో చిన్నారులు నుదిటిపై కత్తితో గాట్లు వేయించుకోవడం విశేషం. మొహర్రం దుఃఖదినాలను పురస్కరించుకుని కోనేరుసెంటర్‌లో వేలాది ముస్లిం సోదరులు నమాజ్ చేశారు.



కోనేరుసెంటర్‌కు ఊరేగింపుగా తెచ్చిన సమాధి నమూనా

పిల్లల నుంచి వృద్ధుల వరకు పాల్గొని కర్బలా మైదానంలో జరిగిన దారుణాన్ని గుర్తు చేసుకుంటూ అశ్రునయనాలతో ప్రార్థనలు నిర్వహించారు. చెస్ట్‌బీటింగ్‌లో గాయాలకు గురైన ముస్లిం సోదరులకు మంత్రి కొల్లు రవీంద్ర కట్టు కట్టారు. పీర్లకు దట్టీలు కట్టారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఉచితవైద్య సేవా శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, ఖాజా, జనసేన నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పీర్లతో ర్యాలీగా తరలివచ్చారు. డీఎస్పీ సీహెచ్ రాజా, ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ, సీఐలు నబి, పరమేశ్వర్, ఏసుబాబుల ఆధ్వర్యంలో శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పహారా ఏర్పాటు చేశారు.

దుర్గమ్మ భక్తులకు శ్రావణమాస కానుక

- 'శ్రీమాలిక' పుస్తకం అందజేయాలని నిర్ణయం



విజయవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు శ్రావణమాస కానుకను ఇవ్వాలని దేవస్థాన అధికారులు నిర్ణయించారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ రూపొందించిన శ్రీమాలిక గ్రంథాన్ని భక్తులకు అందజేయాలని నిర్ణయించారు. కనకదుర్గమ్మ స్తోత్రాలు, దేవీ ఖడ్గమాల స్తోత్రం, లక్ష్మీదేవి పుష్ప పూజ, వారాహి విగ్రహాష్టకం.. ఇలా అమ్మవారికి సంబంధించిన స్తోత్రాలు అష్టోత్తర, సహస్రనామాలతోపాటు ఇతర దేవుళ్ల పూజా విధానాలతో 400 పేజీల పుస్తకాన్ని రూపొందించారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య పురాణపండ కృషికి పుస్తక రూపాన్ని ఇచ్చారు. దీన్ని కొద్దిరోజుల క్రితం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవో శీనానాయక్ ఆవిష్కరించారు. ఇప్పుడు ఈ పుస్తకాన్ని 100 పేజీలతో శ్రావణమాస కానుకగా భక్తులకు పంపిణీ చేయాలని భావిస్తున్నారు.

శాకంబరిగా తిరుపతమ్మ తల్లి



పెనుగంచిప్రోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ అమ్మవారి శాకంబరీ ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తుల సౌజన్యంతో దేవస్థానానికి అందించిన పలురకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకుడు తిరుపతమ్మ-గోపయ్యస్వాములతో పాటు సహదేవతలను శోభాయమానంగా అలంకించారు. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయనకు అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు స్వామివారి శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డీసీ కిషోర్‌కుమార్, పాలక మండలి సభ్యులు, ఈఈ ఎల్.రమా, జంగం శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.



డీజీపీ హరీష్ కుమార్ దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో డీజీపీ దంపతులు

ఇంద్రకీలాద్రి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మవారిని ఆదివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా దంపతులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీని ఈవో శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. దర్శనానంతరం డీజీపీ దంపతులకు వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. దర్శనం అనంతరం ఇటీవల ఆలయంలో చేపట్టిన సంస్కరణలను ఆలయ అభివృద్ధి గురించి డీజీపీకి తెలియజేశారు.



గానం చేస్తున్న డీవీ మోహన కృష్ణ

బాల మురళీకృష్ణకు సంగీత నీరాజనం

విజయవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమితి కార్యాలయ కళావేదికపై మంగళంపల్లి బాల మురళీకృష్ణకు సంగీతాంజలి ఘటిస్తూ పలువురు కచేరీలు చేశారు. మంగళంపల్లి వారి రచనలతో జరిగిన కచేరీలలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ శిష్యులు, వర్ధమాన యువ కళాకారులు లంక తేజస్వి, బంకుపల్లి విద్యాసాగర్, ఎస్.సాత్విక, బుర్రా నీలకంఠ శాస్త్రి, వేమూరి వెంకట విశ్వనాథ్, తుషార పూర్ణవల్లి, శ్రీరంజనిలు సంగీత సాహిత్యాల మాధుర్యాన్ని పంచారు. వీరికి వయోలిన్‌తో కె.సుబ్రమణ్యరాజు, బీవీఎస్ కృష్ణ, మృదంగంతో కుందుర్తి అరవింద్, కేకే ఆదినారాయణ శర్మలు సహకరించారు. సంగీత సుధను పంచిన గాత్ర కచేరీలు, ప్రసిద్ధ గాత్రవిద్వాంసులు మోదుమూడి సుధాకర్, డీవీ మోహనకృష్ణల గానం వారి ప్రజ్ఞను చాటుతూ బాలమురళీకృష్ణకు సంగీత నీరాజనాలర్పిస్తూ స్వర సుధను పంచాయి. వీరికి వయోలిన్‌తో కె.సుబ్రమణ్యరాజు, మృదంగంతో అరవింద్, ఆదినారాయణశర్మలు, ఘటంతో హరిబాబులు సహకరించారు.

సదరం స్లాట్స్ బుకింగ్‌కు అవకాశం

విజయవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పెన్షన్ కోసం పరీక్షలు చేయించుకోవడానికి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి సదరం ధ్రువపత్రాలు స్లాట్ బుకింగ్ ఆప్షన్‌ను శనివారం నుంచి వెబ్‌సైట్లో ఉంచినట్టు మానసిక వికాస కేంద్రం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. కాళ్లు, చేతులు అంగవైకల్యం, దృష్టి లోపం, వినికిడి లోపం, మానసిక మందబుద్ధి, మానసికంగా ఇబ్బంది పడుతున్న వారు(డిప్రెషన్, మానసికంగా వైద్యం అవసరమైన వారు) గ్రామవార్డు సచివాలయం, ఈ సేవా కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసుకోవాలని ప్రకటనలో తెలిపింది.

13న బెరంపార్క్‌లో పెయింటింగ్ పోటీలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా తీరం బెరంపార్క్‌లో ఈనెల 13న పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు.. పోటీల్లో ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొని కళా ప్రతిభను ప్రదర్శించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఆదివారం భవానీపురం బెరంపార్క్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులు, ఔత్సాహికులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పెయింటింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 13న ఉదయం 6.30 గంటలకు విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పి4 (ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజాభాగస్వామ్యం) విధానం, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సేవ్ వాటర్, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ హరితాంధ్ర అంశాలపై పోటీలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. తమ కళా ప్రతిభకు పదునుపెట్టి ప్రజలను జాగృతం చేసేలా పెయింటింగ్ వేసి కృష్ణాతీరానికి కొత్త శోభను తీసుకురావాలన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు అవార్డులతో సత్కరించటం జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 7075196840 నెంబరులో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

ఆరోగ్యానికి నిత్యం యోగా..

యోగా అనేది ఎవరికోసమో కాదని, మ దేహం కోసం మనకోసమేనని, మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలంటే నిత్యజీవితంలో ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏపని అయినా చేయగలం, అదే లేనప్పుడు ఒక్క అడుగు ముందుకు పడదు. అందుకే బద్ధకానికి బందీ కాకుండా ఒక్కక్షణం ఆలోచించి యోగాకు చేరువ కావాలన్నారు. ఉదయాన్నే 45 నిమిషాల సమయాన్ని యోగాకు కేటాయించటం ద్వారా ఆరోజు మనంచేసే ప్రతి పనిని ఏకాగ్రతతో చేయగలుగుతామని, తద్వారా మంచి ఫలితాలు కూడా సొంతమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ రత్న ప్రియదర్శిని, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో

కేంద్ర నిధులు అంతంతమాత్రమే!

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్‌కు ఆశించిన విధంగా నిధులు మంజూరు చేయలేదని, అప్పులు మాత్రం ఇస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ విమర్శించారు. పార్టీ శత వసంతాల వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభా కార్యక్రమాల్లో రామకృష్ణ మాట్లాడారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తోందన్నారు. 166 కోట్ల భారతీయుల మధ్య మత బేధాలు కల్పించి విచ్ఛిన్నకర వాతావరణాన్ని కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తోందన్నారు. మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. లౌకికవాదాన్ని రక్షించుకునేందుకు సీపీఐ జాతీయ మహాసభల్లో చర్చిస్తుందన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్మార్ట్ మీటర్లపై జరిపే పోరాటానికి కలిసి రావాలన్నారు. ఈనెల 9న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెకు సీపీఐ ఉద్యమిస్తుందన్నారు. ఏఐటీయూసీతో పాటు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. రాష్ట్రం ఏడాది పాలనలో రూ.లక్షా 60 వేల కోట్లు అప్పులు చేశారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతున్నప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా నిధులు మంజూరు కాలేదన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ. 31వేల కోట్లు అప్పులు చేశారన్నారు. ఈనెల 10న అమరావతి రైతుల ఉద్యమంలో సీపీఐ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యురాలు పెనుమత్స దుర్గాభవానీ, సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్, యర్రంశెట్టి ఈశ్వరరావు, కె.గగన్, మోదుమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉచిత వ్యాక్సినేషన్‌కు విశేష స్పందన



కృష్ణలంక, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి.దామోదరనాయుడు మాట్లాడుతూ, రేబిస్ వ్యాక్సినేషన్ శిబిరం ద్వారా పెంపుడు జంతువులకు లబ్ధి చేకుర్చడం జరుగుతుందన్నారు. మానవులకు ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి పూర్తిగా నివారించదగినదే అనే విషయాన్ని ఈ శిబిరం ద్వారా తెలియజేశారు. అలాగే జూనోసిస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ, జూనోటిక్ వ్యాధుల నివారణ, నియంత్రణ, మానవ ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి వివరించారు. పెంపుడు జంతువులకు సమయానుకూలంగా వ్యాక్సిన్ వేయడం, శుభ్రత పాటించడం, బాధ్యతతో పెంపకం ఇవ్వడం ద్వారా జంతువు నుంచి మానవులకు వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, 'వన్‌హెల్త్' దృక్పధాన్ని అనుసరించడం ద్వారా జూనోసిస్ వ్యాధుల నివారణ సాధ్యమని పేర్కొన్నారు. జంతు, మానవ, పర్యావరణ ఆరోగ్యాన్ని సమన్వయం చేయడం ద్వారా మాత్రమే జూనోసిస్‌పై సమర్థవంతంగా పోరాడవచ్చని తెలిపారు. ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ పశువైద్య శాల జాయింట్ డైరక్టర్ డాక్టర్ ప్రేమ్ చంద్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ డైరక్టర్ డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ చంద్రమౌళి నాయక్, అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు, డాక్టర్ కె.రవి సుబ్రమణ్యేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో సుమారు 520 పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా అందజేశారు.



లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్



జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

అట్రాసిటీ చట్టం రూపొందించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం

గవర్నర్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు వారి రక్షణకు అట్రాసిటీ చట్టం రూపొందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈనెల 17న విజయవాడలో జరిగే సంఘం జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం పోలీసు కంట్రోల్ రూమ్ సెంటర్‌లోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు కనీసం 20శాతం రిజర్వేషన్లు కూడా అమలు కావడం లేదన్నారు. జాతీయ మహాసభలో జాతీయ, రాష్ట్ర నూతన కమిటీల ఎన్నిక ఉంటుందని, కేంద్ర మంత్రులు ఇంద్రజిత్ సింగ్, రామ్మోహన్‌నాయుడు, పలువురు పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్టు తెలిపారు. మహాసభలో జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు అంశం, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటాపై చర్చించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో ఇబ్బందికరంగా ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల నేతలు, మేధావులు పెద్ద సంఖ్యలో మహాసభలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, యలమందరావు, నాగుల్ మీరా, బుద్ధ దివాకర్, సిటీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సిటీ మహిళా అధ్యక్షురాలు గీతా కృష్ణ, నేతలు చంద్రశేఖర్, రామకృష్ణ, రవీంద్ర, ఎంప్లాయిస్ యూనియన్ నేత ఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్య విద్యాసంస్థల అధినేత శ్రీధర్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం



వన్‌టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక సత్తెనపల్లికి చెందిన భవిష్య విద్యాసంస్థల అధినేత ఇమడాబత్తుని శ్రీధర్ (50) శనివారం కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆదివారం నదిలో గాలించి శ్రీధర్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జున కాలనీకి చెందిన ఇమడాబత్తుని శ్రీధర్, ఉమాకల్యాణి దంపతులు స్థానికంగా 13 ఏళ్ల నుంచి భవిష్య విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఇటీవల శ్రీధర్ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఉదయం 7 గంటలకు సత్తెనపల్లిలో ఉన్న సాయిబాబా గుడికి వెళ్లొస్తానని భార్యకు చెప్పి మోటార్ సైకిల్‌పై బయల్దేరాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అతడి భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవటంతో ఉమా కల్యాణి సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ప్రకాశం బ్యారేజీ 38వ ఖానా పైనుంచి ఓ వ్యక్తి నదిలో దూకినట్టు స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా, అక్కడ మోటార్ సైకిల్ ఉంది. ఆ నెంబర్ ఆధారంగా పోలీసులు సత్తెనపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఆదివారం మధ్యాహ్నానికి పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శ్రీధర్ మృతదేహాన్ని గుర్తించారు. మోటార్ సైకిల్ నెంబర్ ఆధారంగా శ్రీధర్ కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచారు. వారు విజయవాడ వచ్చి మృతదేహాన్ని శ్రీధర్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీధర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మట్టి మాఫియా బరితెగింపు!

(5వ పేజీ తరువాయి)

వెంచర్లకు యథేచ్ఛగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తూరు చెరువు నుంచి తవ్వుతున్న మట్టిని వెలగలేరు, కొత్తూరు, షాబాద, వేమవరం తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీలకు పెద్ద ఎత్తున తోలుతున్నారు. నిబంధనల ప్రకారం తన వ్యక్తిగత అవసరాల కోసం అనుమతి తీసుకున్న వ్యక్తి అర్జీ ప్రకారం కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్లు 164 - 12, 164 - 2ఏ, 175 - 3ఏలలో ఉన్న 4.94 ఎకరాల భూమిలోకే ఈ మట్టిని తరలించాల్సి ఉంది. కానీ కొత్తూరు గ్రామ సర్వే నెంబర్ 97/5ఏలోని 4.14 ఎకరాలు, సర్వే నెంబర్ 95లో 3.75 ఎకరాలు, సర్వే నెంబరు 97/5ఏలో 4.14 ఎకరాల భూముల్లో నడుస్తున్న ఇటుక బట్టీలకు నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటి వరకు సుమారు ఐదు వేల ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలించినట్టు సమాచారం. రియల్ వెంచర్లుగా అభివృద్ధి చేయాలనుకున్న మరికొందరి భూములకు కూడా పెద్ద ఎత్తున అక్రమంగా మట్టిని రవాణా చేశారు. కొత్తూరు గ్రామంలోనే సర్వే నెంబర్ 155/4లో 52 సెంట్లు, సర్వే నెంబర్ 155/5లో 74 సెంట్ల భూమిలోకి 400 ట్రాక్టర్లు, సర్వే నెంబర్ 136/3బీలో 69 సెంట్ల భూమిలో 550 ట్రాక్టర్ల మట్టి తరలించినట్టు తెలిసింది. సర్వే నెంబరు 136/2బీలో 90 సెంట్లలో 10 అడుగుల ఎత్తున మట్టి పోశారని సమాచారం. సర్వే నెంబర్ 84/4సీ1, 4సీ1ఏ, 4సీ1బీలలో 1.50 ఎకరాల భూమిలో 600 ట్రాక్టర్ల మట్టిని తరలించారని తెలిసింది. సర్వే నెంబరు 82/6 లో 85 సెంట్ల భూమిలో 500 ట్రాక్టర్ల మట్టి, సర్వే నెంబరు 149/10ఏలో 50 సెంట్ల భూమిలో 300 ట్రిప్పుల చొప్పున మట్టిని అక్రమంగా వ్యాపార ప్రయోజనాల కోసం తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలకు నీళ్లు

కొత్తూరు చెరువులో ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక క్యూబిక్ మీటరు లోతు వరకే పూడిక తీత పేరుతో మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చారు. కానీ, 7-8 అడుగుల లోతున చెరువును ఎడాపెడా తవ్వేశారు. అంటే మూడు క్యూబిక్ మీటర్ల మేర మట్టిని అక్రమంగా తవ్వేశారు. దరఖాస్తుదారునికి రాత్రి వేళ తవ్వటానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. కేవలం పగటి సమయంలో మాత్రమే తవ్వాలి. కానీ రేయింబవళ్లు తవ్వకాలు జరుపుతున్నారు. వాస్తవానికి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తవ్వకాలు జరపాల్సి ఉండగా.. దీన్ని పూర్తిగా విస్మరించారు. చెరువు కట్టకు డ్యామేజీ వాటిల్లకుండా తవ్వాలి. కానీ, చెరువు కట్టకు డ్యామేజీ కలిగేలా తవ్వకాలు జరిపారు. రైతులకు సాగునీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. గుంతలు తవ్వకూడదు. కానీ చెరువు అంతా గుంతలమయం చేశారు. గతంలో అక్రమార్కులు మొదట్లో అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు జరిపారు. దీనిపై స్థానికులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయటంతో.. అక్రమ తవ్వకాలను గుర్తించి బాధ్యులకు రూ. లక్ష జరిమానా కూడా విధించటం జరిగింది.



ఎన్నారైలతో కలిసి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

క్రీడాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

విజయవాడ (స్పోర్ట్స్), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ క్రీడాభివృద్ధిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని శాప్ చైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. అమెరికా లోని ఫ్లోరిడా రాష్ట్రం టంపా సిటీలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ అమెరికా తెలుగు సంబరాల నిర్వాహకుల ఆహ్వానంతో ఆదివారం రవినాయుడు సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన పి-4 విధానం ద్వారా ప్రతిభ కలిగి ఆర్థిక అవరోధాలు ఎదుర్కొంటున్న ఏపీ క్రీడాకారులను ఆదుకోవాలని పిలుపునిస్తూ పలువురు ఎన్నారై లతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాష్ట్రంలోని క్రీడాకారులను, క్రీడలను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్టాల్‌ను సందర్శించిన ఎన్నారైలకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం జరుగుతున్న కార్యక్రమాలు వారికి వివరించారు.

స్కేటింగ్ రోల్‌బాల్ క్రీడాకారుడు

శ్రీశాంత్‌కు ఘన స్వాగతం

(5వ పేజీ తరువాయి)

జూన్ 26, 27, 28, 29 తేదీల్లో కెన్యాలో జరిగిన పోటీల్లో భారత జట్టులో ఆడి విజయానికి కృషి చేశారు. కాగా, శ్రీశాంత్ తల్లిదండ్రులతో కలిసి ఆదివారం రాత్రి గ్రామానికి వచ్చారు. వడ్లమన్నాడు నుంచి శ్రీశాంత్‌ను గ్రామస్తులు ఊరేగింపుగా గ్రామానికి తీసుకెళ్లారు. వడ్లమన్నాడులో భారీగా బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. తాత రేణుకరాజుతో విజయోత్సవ కేక్‌ను కట్ చేయించారు. అనంతరం శ్రీశాంత్‌ను సన్మానించారు. శ్రీశాంత్‌తో గ్రామస్థులు సెల్ఫీలు దిగి వారి తల్లిదండ్రులు రాంబాబు, చైతన్య దంపతులను అభినందించారు. తన మనవడు ఇంత మంచి స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భగా రేణుకరాజు అన్నారు. ఇంతటి విజయం తర్వాత స్వగ్రామానికి రావడం, ఇక్కడి ప్రజలు, బంధువులు చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివని శ్రీశాంత్ చెప్పారు. తన కోచ్ సిల్వావాగ్రే తన విజయానికి కారణమని వివరించారు. ఇంకా ఈ గేమ్‌లో నెక్స్‌లెవల్ కోసం కృషిచేస్తానని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

కోడి పందేలు, పేకాట రాయుళ్లపై డ్రోన్లతో నిఘా



కంకిపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ మురళీకృష్ణ అన్నారు. గొడవర్రులో ఎస్సై డి. సందీప్‌తో కలిసి డ్రోన్‌ను వినియోగించి పేకాట, కోడిపందెం రాయుళ్లపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం కోడి పందేలు, పేకాటలు నిర్వహిస్తున్నారన్న పూర్తి సమాచారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నిడమర్తి సౌజన్య

గ్రామాభివృద్ధే లక్ష్యం

గన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ నిడ మర్తి సౌజన్య అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిడమర్తి సౌజన్య మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలో గ్రామపంచాయతీ నిధులు రూ. పదిలక్షలతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థుల సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ సహాయంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ దాసు, జాస్తి పణి శేఖర్, నిడమర్తి నాగేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

పెనమలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రాం జీవితం యువతకు ఆదర్శమని వ్యాఖ్యానించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



గన్నవరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాచేటి మురళీ

గన్నవరం : ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక అంబేద్కర్ పార్క్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్, ఏసు పాదం, కోటయ్య, శ్రీకాంత్, శివయ్య తదితరులు పాల్గొన్నారు. సుందరయ్య పార్క్ ఎదురుగా ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. దేవరపల్లి విక్టర్ బాబు, బాలస్వామి, దుర్గారావు, యేసుబాబు, చంద్రశేఖర్, సీతారామయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి: ఎస్టీయూ

ఉయ్యూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాలు మెరుగుపరచాలంటే ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. సాయిశ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లాశాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఇమ్మానుయేల్, డి.చంద్రశేఖర్, సీపీఐ జిల్లాశాఖ ఆర్థిక కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, కె.మాధవరావు, ఉయ్యూరు మండల శాఖ బాధ్యులు సుగుణాకర్‌రావు, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెలో పాల్గొనాలి

ఉంగుటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షకులంతా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ కృష్ణాజిల్లా అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరరావు కోరారు. ఉంగుటూరులోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో ఆదివారం జరిగిన ప్రజాసంఘాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు తదితరులు పాల్గొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన వైద్యశిబిరంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

200 మందికి వైద్య పరీక్షలు

పెనమలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో అనుమోలు ఆదరణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బోడెప్రసాద్ ప్రారంభించారు. సుమారు రెండువందల మంది షుగరు, బీపీ తదితర వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ప్రతినెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న అనుమోలు ఆదరణ ట్రస్టు అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావును ఎమ్మెల్యే అభినందించారు. టీడీపీ నాయకులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

లో ఓల్టేజీతో ఇక్కట్లు!

- పెరిగిపోతున్న నివాస ప్రాంతాలు
- సబ్‌స్టేషన్ల ఏర్పాటులో ప్రభుత్వ తాత్సారం
- మరో వైపు ప్రమాదకరంగా ఫ్లెక్సీలు
- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందిపడుతున్న స్థానికులు

(గుణదల - ఆంధ్రజ్యోతి)

నగరంలో నివాసాల ఏర్పాటుకు అనువుగా ఉన్న గుణదల.. రామవరప్పాడు.. ప్రసాదంపాడు గ్రామాల్లో మూడు కాల్వల అవతలగల ప్రాంతం రోజురోజుకూ విస్తరిస్తుంది. దీంతో ఈ ప్రాంతంలో తరచూ లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. విస్తరణకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆ ప్రాంతానికి ఎనికేపాడు సబ్‌స్టేషన్ సిబ్బంది వెళ్లి సమస్యను పరిష్కరించడానికి నానా అవస్థలు పడటంతో పాటు కాలయాపన జరుగుతోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు కరెంట్ రాక కోసం ఎదురుచూడక తప్పడం లేదు. గుణదల కార్పొరేషన్ ఏరియా పరిధిలోకి వచ్చే ప్రాంతంలో భారీగా అపార్ట్‌మెంట్‌లు..విల్లాలు..నివాసాలు ఏర్పడ్డాయి. అలాగే రామవరప్పాడు, ప్రసాదంపాడు మూడు కాల్వల అవతల పంట పొలాల్లో నివాసాలు భారీగా పెరిగిపోయాయి. వీటన్నింటికీ ఎనికేపాడు సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ అందించాల్సి ఉంది. దీంతో ఇక్కడ విద్యుత్‌శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.



విద్యుత్ లైన్లపై పడుతున్న ఫ్లెక్సీలు

విద్యుత్ లైన్లపై పడుతున్న ఫ్లెక్సీలు

రామవరప్పాడు మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న హోర్డింగ్‌లపై ఉన్న ఫ్లెక్సీలు గాలీదుమారం వచ్చినప్పుడల్లా చిరిగి కరంటు లైన్లమీద పడుతుండటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మంటలు చెలరేగిన సందర్భాలు ఉన్నాయి. ఫ్లెక్సీలు రోడ్డుపై వెళ్లే వాహనాలపై పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఉన్నత అధికారులు ఈ విషయమై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కంకిపాడులో మాజీ ఎంపీపీ దేవినేని, తుమ్మలపల్లి.. పెరికీడులో కరపత్రాల పంపిణీ.. యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో శొంఠి శివరాంప్రసాద్

కూటమి పాలనలో వేగంగా అభివృద్ధి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



తాడిగడప సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో అత్యంత వేగంగా అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆదివారం తాడిగడప మునిసిపాలిటీ కార్మికనగర్ కట్ట వద్ద జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. అనుమోలు ప్రభాకరరావు, పీతా గోపిచంద్, నర్రా చంటి, డి రమాదేవి పాల్గొన్నారు.

● పెనమలూరు, పెదపులిపాక, కేసీపీ కాలనీల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, వెలగపూడి శంకరబాబు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీ చంద్, తుమ్మల రాంకుమార్, నర్రా చంటి, దోనేపూడి రవికిరణ్, ముసునూరు శ్రీనివాసరావు, ముసునూరు శ్రీధర్, గుజ్జర్లపూడి బాబురావు, యార్లగడ్డ సుచిత్ర తదితరులు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ఏడాది కాలంలో టీడీపీ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు.

కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

కంకిపాడు : అభివృద్ధి, సంక్షేమే ప్రధాన అజెండాగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. కంకిపాడులో రెండవ రోజు నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్ర మంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వర రావు, అన్నే రామారావు, వణుకూరు విక్రం, శ్యామ్, బాజి, సత్తిబాబు, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్ : కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం కానుమోలు, పెరికీడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేసి పాలనపై ప్రజల అభిప్రాయాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల సూర్యం, కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, వేగిరెడ్డి పాపారావు, చింతల అప్పారావు, దన్నే దుర్గారావు, కొత్తూరు అంజనేయులు, దన్నే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం చెంచుల కాలనీలో.. ఆత్కూరు కనకదుర్గమ్మకు సారె సమర్పించేందుకు..

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

హనుమాన్‌జంక్షన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని అంజనేయులు స్వామి వారిని దర్శించి కలశ పూజలో పాల్గొన్నారు. ఏర్పాట్లను యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి గుమ్మడి శేషగిరిరావు, నందిగం స్వామి, పాబోలు బదరీనాథ్, తవ్వా పూర్ణచంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.



జంక్షన్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చలసాని పూజలు

గన్నవరం : విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లతో పాటు ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. నర్రా అనిల్ కుమార్, జాస్తి వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. చెంచుల కాలనీలోని లక్ష్మీ తిరుపతమ్మకు యాదవుల సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● కేసరపల్లి గణపతి సచ్చిదానంద స్వామి పంచతత్వ గురుపాదుకా మందిరంలో ఆదివారం భగవద్గీత పారాయణం చేశారు ఆలయ ట్రస్టు సభ్యులు రామ్మోహనరావు, భాగ్యలక్ష్మి, నాగమణి, మాజీ సర్పంచ్ సతిసక్కుబాయి, అన్నే భారతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆత్కూరు కనకదుర్గ అమ్మవారికి ఆదివారం స్థానిక నాయుడుపేట భక్తబృందం ఆషాఢ సారె ఘనంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రతాప లక్ష్మీనారాయణ, కుమార్, భక్తులు చిన్నా, మేస్త్రి బుజ్జి, పడాల శంకర్, కృష్ణప్రసాద్, నాయుడుపేట మహిళాభక్తబృందం, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : తొలి ఏకాదశిని పురస్కరించుకుని గండిగుంట బైపాస్‌రోడ్డు షిర్డి సాయిబాబా మందిరంలో ఆదివారం సామూహిక సాయి సత్యవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పదేవస్థానం సొసైటీ పూజారి కామేశ్వర శర్మ పూజాది కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు మాజీ ఎమ్మెల్యే అన్నే బాబూరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు మురళి, ప్రియాంక, ప్రసాద్, అరుణ అన్న సమారాధన చేశారు.



గండిగుంట షిర్డీసాయిబాబా మందిరంలో సామూహిక పూజలు



ఉయ్యూరు.. గన్నవరంలో రేబీస్ టీకాలు వేస్తున్న డాక్టర్లు

జూనోటిక్ వ్యాధులపై అవగాహన

ఉయ్యూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జూనోసిస్ వ్యాధులపై అవగాహన, నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని ఉయ్యూరు అసిస్టెంట్ డైరెక్టర్ మేడ రాజ శేఖర్ అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో 130 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మండల పశువైద్య అధికారి డాక్టర్ ధనేకుల వీణ, ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : పెంపుడు జంతువులపై అప్రమత్తంగా ఉండాలని గన్నవరం ఎన్టీఆర్ కళాశాల పశువైద్య చికిత్స కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ కళాశాల పశువైద్య చికిత్స కేంద్రంలో ఆదివారం 227 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేశారు. డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీ రాణి పాల్గొన్నారు. అల్లాపురం ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీఏహెచ్ డాక్టర్ జి.బాలకృష్ణ, గొల్లనపల్లి, ముస్తాబాదలో డాక్టర్‌లు రెడ్డెమ్మ, మేరీ వైడూర్యంలు రేబిస్ నివారణ టీకాలు వేశారు.

హనుమాన్‌జంక్షన్ : కుక్కల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక చికిత్స లేని రేబిస్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని బాపులపాడు ఏరియా పశువైద్యాధికారి ఎం. ప్రమీలరాణి తెలిపారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం బాపులపాడు ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. పశుగణ సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఉంగుటూరు : జూనోటిక్ వ్యాధులపట్ల జంతు ప్రేమికులకు అవగాహనతో కూడిన అప్రమత్తత చాలా అవసరమని పశువైద్యాధికారులు సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, ఇందుపల్లి ప్రభుత్వ పశువైద్యశాలల్లో వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ డాక్టర్లు సీహెచ్.మల్లిబాబు, జి.స్వర్ణలత, ఎన్.నాగార్జున, జి.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



బాపులపాడు ఏరియా పశువైద్యశాలలో.. ఉంగుటూరులో..

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



హనుమాన్‌జంక్షన్ జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగ వ్యయాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ఆర్థిక వెసులు బాటు ఉన్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శని వారం రాత్రి రంగన్నగూడెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వీర్ల సుబ్బయ్య తన గృహంలో సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన 3కేవీ సోలార్ ప్యానల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే వారికి గరిష్ఠంగా రూ.75వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కూడా కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈ మురళీకృష్ణ, ఎస్ఎస్పీఎల్సీ పీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, దయాల రాజేశ్వరరావు, సర్పంచ్ కుసుర్తి రంగామణి, పుసులూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి వెండి ఆభరణం బహూకరణ

పామర్రు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని వీరాంజనేయ దేవస్థానం అధికారి పీవీఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉండ్రపూడి-పోలవరం అడ్డ రోడ్డు వద్ద వేంచేసి యున్న వీరాంజనేయ స్వామి ఆలయానికి విజయవాడకు చెందిన ఉప్పలపాటి ఉమాదేవి రూ.1లక్ష విలువగల 865గ్రాముల వెండిఆభరణం(నక్షత్ర హారతిని) స్వామి వారికి బహూకరించినట్లు ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాడిశెట్టి వేంకటేశ్వరరావు, మట్టా వేంకటేశ్వరరావు ప్రధాన అర్చకుడు పాల్గొన్నారు.



వెండి ఆభరణాన్ని అందిస్తున్న దాత ఉమాదేవి కుటుంబసభ్యులు

గుడివాడ టూటౌన్ సీఐగా హనీష్

గుడివాడ, జూలై 6(ఆంధ్రజ్యోతి) : గుడివాడ టూటౌన్ సీఐగా జె.ఆర్.కె హనీష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి విధులు నిర్వర్తించిన సీహెచ్ నాగప్రసాద్ ఏలూరు రేంజ్ వీఆర్‌లోకి వెళ్లారు.

ఏకలవ్యుడి జయంతి

పామర్రు: గురుదక్షిణ గా తన బొటన వ్రేలు ఇచ్చి గురుభక్తి చాటుకున్న గొప్ప వ్యక్తి ఏకలవ్యుడు అని ప్రాంతీయ గిరిజన హక్కుల పోరాట ఐక్యవేదిక అధ్యక్షుడు రాయవరపు వేంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక విజయవాడ రోడ్డులోని సుబ్బారెడ్డి కాంప్లెక్సులో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కందులరాము, కొల్లాబత్తుల సాల్మన్ రాజు, కలపాల సుధాకర్, రాజేష్ పాల్గొన్నారు.

భీమేశ్వరుడిని దర్శించుకున్న క్రాంతి దంపతులు

గుడివాడ : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె బర్లపూడి క్రాంతి, రవికిరణ్ దంపతులు ఆదివారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రులోని 17వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దానిలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పామర్రు లో ఏడాదిపాలనలో జరిగిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు, బస్టాండ్, పీహెచ్‌సీల ఆధునీకరణ, అన్న క్యాంటీన్ శంకుస్థాపన తదితర అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కొందరు ఇళ్ల స్థలాలు, కొత్త పింఛన్లు అందించేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. త్వరలోనే అర్హతగల ప్రతి ఒక్కరికీ కొత్తగా ఇళ్ల స్థలాలు, పింఛన్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు వల్లూరిపల్లి గణేష్, తాడిశెట్టి మధు, మంతెన రామాంజనేయులు, పరస సుబ్రమణ్యం, వీరంకి వేంకటేశ్వరరావు, ఈడే నాని, దాలిపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన వల్ల ప్రజాలకు ఎన్నో ఉపకారాలు జరుగుతున్నాయని ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చేయనున్నామని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. ఆదివారం గుడ్లవల్లేరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో ప్రభుత్వ పాలన గురించి వివరిస్తూ వారు చెప్పిన సమస్యలను తెలుసుకున్నారు. సింగలూరు కాల్వగట్టు ప్రాంతం, జేమ్స్‌పేట, అంబేద్కర్‌నగర్, అగ్రహారం ప్రాంతాలలో ఆయన ఇంటింటికీ తిరిగారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలవరపు వెంకటరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని రంగబాబు, బూత్ ఇన్‌చార్జ్‌లు మురాల నరేష్, సాయి, జంగం మోహనరావు, శ్రీరామ్, పల్లెం నరసింహారావు, నాని, మల్లి, నాగేశ్వరరావు, జయరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరులో కట్టాని చెరువు, చితలగుంట, చినగొన్నూరు గ్రామాల్లో తొలిఅడుగు కార్యక్రమాలు నిర్వహించారు.



పామర్రులో ప్రజల కష్టాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



సింగలూరు కాల్వగట్టు ప్రాంతంలో ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, టీడీపీ నేతలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు

అమ్మవారికి ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారు ఆదివారం శాఖాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని కాయకూరలు పండ్లతో అలంకరించారు. ప్రధాన ఆలయం, అలవేటి మండపం, ద్వితీయాలయాలను భారీగా 12 టన్నుల కాయకూరలతో, పలు రకాల పడ్లతో, ఆకు కూరలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించగా కనులవిందు చేశాయి. ఆదివారం అమ్మవారిని శాఖాంబరిగా 30 వేల మందిభక్తులు దర్శించుకొన్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కొండలరావు తెలిపారు.

కూచిపూడి : ఆషాఢ మాసం సందర్భంగా మండల పరిధిలోని భట్లపెనుమర్రులోని దేవాలయాల్లోని అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మ తల్లి, రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో రాజ్యలక్ష్మీదేవి అమ్మవారికి మేళతాళాలు, డప్పు విన్యాసాల నడుమ సారె సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మొహర్రం త్యాగానికి ప్రతీక



పమిడిముక్కలలో..

పమిడిముక్కల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అలీనఖీపాలెంలో ఆదివారం మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొహరం మాసం పదిరోజుల సందర్భంగా మౌలానా సయ్యద్ సైఫ్ అబేది గురువు ఆధ్వర్యంలో ఇమామ్ హుస్సేన్, కుటుంబ సభ్యుల గురించి పలువురు గుర్తుచేశారు. ఇమామ్ హుస్సేన్ కమిటీ సంఘ పెద్ద ఆధ్వర్యంలో కర్బలా స్ఫూర్తి నిర్వహిస్తూ పదో రోజు(అశుర) షియా మతస్థులు శోక గీతాలు ఆలపిస్తూ యా హుస్సేన్, యా అబ్బాస్ అంటూ పిల్లలు, యువకులు, పెద్దలు చిన్నా పెద్ద తేడాలేకుండా చెస్ట్ బీటింగ్‌తో రక్తతర్పణం చేశారు. హుస్సేనీ కమిటీ మత గురువు సయ్యద్ సైఫ్ అబేది ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. హుస్సేనీ కమిటీ అధ్యక్షుడు మిర్జా జైనుల అబేదీన్, కార్యదర్శి మిర్జా నజరే హుస్సేన్ , రాష్ట్ర మైనారిటి సెల్ ఉపాధ్యక్షుడు మిర్జా మజేద్ రజా పాల్గొన్నారు.

గుడివాడ : మొహర్రంను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఆదివారం స్థానిక టిడ్కో కాలనీలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్ సయ్యద్ ఆరీఫ్ మాట్లాడుతూ మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు. కొండపల్లి అల్తాఫ్‌రజా, కాలేషాపీర్ బాజీ, అహ్మమద్ బేగ్, అబ్దుల్ అలీమ్, సయ్యద్ ఇర్ఫాన్, రహీమున్నీసా, అజీజ్, పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : దయ, కరుణ, శాంతికి ప్రతీక మెహరం. త్యాగాలకు ప్రతీకైన మొహరం సందర్భంగా గుడ్లవల్లేరులోని పలు గ్రామాల్లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. డోకిపర్రు తురాయిపాలెం, కౌతవరం గ్రామాల్లో పీర్ల ఊరేగింపును ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

కూచిపూడి : మొహర్రంను ఆదివారం ముస్లీం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్ల ఊరేగింపు నిర్వహించటంతోపాటు నిప్పుల గుండంలో నడిచే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాజ, భట్లపెనుమర్రు, నిడుమోలు గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. మత పెద్దలు మహమ్మద్ హుస్సేన్, ఎండి.ఇబ్రహీం, ఎండి. మీరా మొహిద్దీన్, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : ఐలూరులో ఆదివారం మొహరంను ముస్లీంలు భక్తి శ్రద్దలతో జరుకున్నారు. పీర్ల ఊరేగింపు నిర్వహించారు.



గుడివాడలో..

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గుడివాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరమాచినేని శైలజ, పంచుమర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : తొలి ఏకాదశ పర్వదినం సందర్భంగా ఆదివారం గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తొలి ఏకాదశ విశిష్టతను అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు వివరించారు. విశేషమైన పేలలాపిండిని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.

పామర్రు : హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన తొలి ఏకాదశి పండుగను ఆదివారం భక్తి శ్రద్ధలతో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మహిళాలు వేకువజామునే తలంటు స్నానాలను ఆచరించి తమ ఇండ్లలో మహవిష్ణువుని కీర్తిస్తూ ఏకాదశ వ్రతాలను ఆచరించారు. స్థానిక రాపర్ల గణ్యశ్రీ వేంకటేశ్వరస్వామి, పామర్రు శివాలయం, అంకమ్మ తల్లి దేవస్థానం, అయప్పదేవాలయం,ఉండ్రపూడి-పోలవరం క్రాస్‌రోడ్డులోగల వీరాంజనేయ స్వామి దేవాలయాలతోపాటు మండలంలోని నిమ్మకూరు, పేరిశేపల్లి గ్రామాల్లో గల వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూచిపూడి : తొలి ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నాట్య శిల్పారామంలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యాంశాలు అహుతులను అలరించాయి. ప్రవాసభారతీయురాలు లహరి కంచదలాయతాక్షి..కామాక్షి అంశాన్ని ప్రదర్శించగా, సింధు, భార్గవి,. ధాత్రి, సువర్ణ, శ్రావ్య శ్రీ, శార్వాణి, సత్యనందినిలు పలు అంశాలు ప్రదర్శించి మెప్పించారు. కళాకారులను మెమొంటోలు అందించి సత్కరించారు.



కూచిపూడిలో..

బాబూ జగ్జీవన్‌రామ్ నేటితరానికి స్ఫూర్తి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నిమ్నజాతుల రిజర్వేషన్ల పరిరక్షకుడు డాక్టర్ బాబూజగ్జీవన్ రామ్ అని, ఆయన మార్గంలో నేటితరం నేతలు, యువత పయనించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. స్థానిక చాట్లవానిపురంలో ఆదివారం నిర్వహించిన బాబూజగ్జీవన్‌రామ్ 118వ వర్ధంతిలో ముఖ్యఅతిధిగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తోకలసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, తాడిశెట్టి మధు, వీరంకి వేంకటేశ్వరరావు, మంతెన రామంజనేయులు, పరస సుబ్రమణ్యం, చక్రాలరాజు, చాట్లరమేష్, దాలిపర్తి ప్రసాద్, పాల్గొన్నారు.

గుడివాడ : మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్, కొదమల గంగాధర్, గంధం సైమన్‌బాబు, ఏలీషా, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజావేదికలో బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు వెనిగండ్ల రామకృష్ణ(నాని) పాల్గొన్నారు.

స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ 39వవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విక్టర్, శ్రీను, నందివాడ ఎంపీపీ ఆదాం, పాలేటి చంటి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

రేబీస్ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు

గుడ్లవల్లేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జంతువుల నుంచి మనిషికి వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధి రాబీస్ వ్యాధి. దీని బారిన పడకుండా క్రమం తప్పకుండా పెంపుడు సునకాలు, పిల్లుల వంటి జంతువులకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని గుడ్లవల్లేరు పశుసంవర్ధకశాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా గుడ్లవల్లేరు పశువైద్యశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో పెంపుడు సునకాలకు యాంటీ ర్యాబీస్ వ్యాధిని రోదక టీకాల ఉచిత శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. కాగా శిబిరానికి స్పాన్సర్‌గా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్ కుమార్ వ్యవహరించారు. క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జోన్‌చైర్‌పర్సన్ శశికళ, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, మోహనరావు, పాల్గొన్నారు.



వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ హనుమంతరావు

గుడివాడ : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక రావి వీరభద్రయ్య బహుళార్థ పశువైద్యశాలలో ఆదివారం కుక్కలకు యాంటీరేబీస్ టీకాలను వేశారు. 248 కుక్కలకు టీకాలను ఉచితంగా వేసినట్టు ఉపసంచాలకులు డా.రత్నశ్రీ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోని వారికోసం మరో మూడు రోజులు వరకు టీకాలను వేయించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మొవ్వ ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో 50 కుక్కలకు రాబిస్ వ్యాధి రాకుండా పశువైద్యులు కుక్కలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు అజయ్, రవి, రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారత్న అవార్డుల పంపిణీ

పమిడిముక్కల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో గురజాడలో ప్రతిభకు ప్రోత్సాహక సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పదోతరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 19 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించి విద్యారత్న మెడల్స్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేసి అభినందించారు. సీనియర్ జర్నలిస్టు కె. సాల్మన్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ చైర్మన్ దాసరి ఇమ్మానుయేల్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, జంపాన కొండరావు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.రాజు అతిధులుగా హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అంజేశారు.

రాళ్ల దాడిపై ఫిర్యాదు

పామర్రు : పామర్రులోని ఓ ఎలక్ట్రికల్ షాపు యాజమానిపై దాడికి పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. స్థానిక శివరామ కాంప్లేక్స్‌లో గల అమలేశ్వరి ఎలక్ట్రికల్ షాపు యాజమాని కాసాని శ్రీనివాసరావు తన దుకాణంలో ఉన్న సమయంలో చాట్లవానిపురానికి చెందిన చాట్ల చిన రమేష్‌తోపాటు మరికొంత మంది వచ్చి కులం పేరుతో తిట్టావంటూ విచక్షణారహితంగా రాళ్లతో దాడికి పాల్పడ్డారని కాసాని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. తమను అకారణంగా కులం పేరుతో దూషించడంతోపాటుగా, ఇతర అసభ్య పదజాలంతో తిట్టాడని చాట్ల చిన రమేష్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై ఆదివారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అయితే ఏమైన విభేదాలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి, లేదా న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాలి పలువురు మేధావులు పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతో ఉందని సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1993-94 పదోతరగతి పూర్వ విద్యార్థులు

కూచిపూడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవి జడ్పీ పాఠశాలలో 1993-94వ సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారికి పాదాభివందనం చేశారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుని ఆత్మీయ పలుకరింపు, అల్లర్లు, ముచ్చట్లు నెమరువేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. పండుగ వాతావరణంలో ఈ ఆత్మీయ కలయిక నిర్వహించుకోవటం మిక్కిలి సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాల వెల్లువ

గుడ్లవల్లేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో రెండవ అన్నవరంగా ప్రసిద్ధి పొందిన రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపురం జీర్ణోద్ధరణ, ఆలయ ఆధునికీకరణ, దశావతారాల మండప నిర్మాణం, వ్రతమండప ఆధునీకరణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన భక్తులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఆలయ అభివృద్ధి కోసం తమవంతు సాయాన్ని అందజేస్తున్నారు. ఆదివారం గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు మనవడు, వల్లభనేని కృష్ణప్రసాద్ (నాని)తనయుడు వల్లభనేని సాయి విహాన్ రూ. 1,00,116 లు తమ విరాళంగా కమిటీకి అందజేశారు. అలానే అమెరికాలో స్థిరపడిన వల్లభనేని రవీంద్ర, లక్ష్మీభ్రమర దంపతులు వారి కుమారుడు సాయితేజ,కుమార్తె మల్లెల శ్వేతలు రూ. 1,00,116 లు, రవీంద్ర మిత్రుడు శ్రీలంక నివాసి అయిన శ్రీజన రూ. 17,000, లండన్ లో స్థిరపడిన తంగిరాల శివరామకృష్ణ రూ. 1,00,000, సూర్యాపేట లోని సెవెన్ హోటల్ నిర్వాహకులు దాసరి వెంకటరామకృష్ణ ప్రసాద్ రూ. 50,000, అన్నే ప్రసాదరావు, వారికుమారుడు అన్నే రాజేశ్వరరావులు రూ. 50,000, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దివంగత వల్లభనేని బాపయ్య చౌదరి కుమారుడు వల్లభనేని ఈశ్వర్ రూ. 50,116 లు, యద్దనపూడి శివకుమార్ (ఆస్ట్రేలియా) రూ. 11,111లు, శీరం సుబ్బారావు రూ.10,011, కొట్టి సూరిబాబు రూ. 13,016 లు, కుంచాల ఏడుకొండలు రూ 10,000లు చొప్పున విరాళాలను నిర్వాహక కమిటీకి అందజేశారు.



విరాళాన్ని అందజేస్తున్న సాయివిహాన్

యూఎఫ్‌ఆర్టీఐ నూతన కమిటీ

పమిడిముక్కల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టంపై అందరికీ అవగాహన అవసరమని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ ఆర్గనైజేషన్ చైర్మన్ దాసరి ఇమ్మానుయేల్ అన్నారు. గురజాడలో యుఎఫ్ ఆర్టీఐ కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సామాన్యులకు సమాచారహక్కు చట్టంపై అవగాహ కల్పించారు.అనంతరం నూతన కమిటీని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. కో కన్వీనర్ జంపాన శ్రీనివాస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

నందివాడ : ఈ నెలలో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున లక్ష రూపాయలు జరిమానా విధించినట్టు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురకు మోటారు వాహనాలు నడుపుతుంటే ముందుగా వారి తల్లిదండ్రులు శిక్షార్హులవుతారన్నారు.

భరద్వాజ జయంతి

గుడివాడ : తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ అని విశ్రాంత ఎంఈవో భవిరి శంకరనాథ్ కొనియాడారు. ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర ఆధ్వర్యంలో భరద్వాజ 98వ జయంతి సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత డైట్ కళాశాల అధ్యాపకులు ఎం.వి.జి ఆంజనేయులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

నంగేగడ్డలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



నాగాయలంక, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నంగేగడ్డలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాడేపల్లి వెంకట పాపారావు, అమ్ముల సుబ్బారావు, మిరియాల రామాంజనేయులు, ఈపూరి నాగార్జున, చిరివేళ్ల నాగరాజు, ఉప్పల ప్రసాద్, ముప్పరాజు సందీప్ పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న బంటుమిల్లి ఉన్నత పాఠశాల 1986-1987 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు

సందడిగా బంటుమిల్లి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బంటుమిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. 1986-1987 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 39 సంవత్సరాల తరువాత స్థానిక కాంతి కేంద్రంలో సమావేశమై ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకుని, పరస్పర అనుభవాలను పంచుకున్నారు. వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో స్థిరపడినప్పటికీ ప్రతి సంవత్సరం పండుగ వాతావరణంలో ఆత్మీయ కలయిక జరగాలని కోరుకున్నారు. గురు శిష్యుల అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.

వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలి : సీఐ

అవనిగడ్డ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని అవనిగడ్డ సీఐ యువకుమార్ స్పష్టం చేశారు. పులిగడ్డలో మోపిదేవి మలుపు, పెనుమూడి వారధి వైపు వేగ నియంత్రణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రమ్ములు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై లారీలు, కంటైనర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లకుండా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు. శనివారం రాత్రి రామచంద్రాపురంలో ఆయన పల్లె నిద్ర నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల అంతర్గత శాంతి భద్రతలు, ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.



భక్తిశ్రద్ధలతో మొహర్రం..పీర్ల ఊరేగింపు

చల్లపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పడమరవైపు, తూర్పువైపు ఇస్లాం నగర్‌లలో ఉన్న పీర్ల పంజా ఆస్థానాల వద్ద పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గంధం, ధుని సమర్పించారు. పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. ముస్లింలు షర్బత్ సమర్పించారు. **గూడూరు :** మండలంలో మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు హజరత్ నాల్ సాహెబ్ ఆస్తానా, బారా ఇమామ్ పంజా నకర్ ఆలీ సాహెబ్ ఆస్తానాలతో పాటు ఆకులమన్నాడు, పోలవరం, మల్లవోలు, తరకటూరు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి షర్బత్ పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





బందరు, మోపిదేవిలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మచిలీపట్నం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు జంతువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సిహెచ్ చిన నరసింహులు అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ప్రారంభించారు. పి.వి.ఫణికుమార్, అక్కినేని విజయకుమార్, కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. **మోపిదేవి :** మోపిదేవి పశువైద్యశాల ఆవరణలో డాక్టర్ నంద కిషోర్ ఉచిత రేబిస్ నివారణ వ్యాక్సిన్ వేశారు. సర్పంచ్ నందిగం మేరీ రాణి ప్రారంభించగా, 50 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, రైతులు సుధాకర్, లీలా దివ్య భారతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు 32 మంది క్రీడాకారుల ఎంపిక

నాగాయలంక, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నాగాయలంకలో రాష్ట్ర స్థాయి పోటీలకు సీనియర్ బేస్ బాల్ జట్ల ఎంపిక ఆదివారం నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నాగాయలంక రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భోగాది శివ విష్ణు వర్ధన్ ప్రారంభించగా, పీడీలు గాజుల లక్ష్మీ ప్రసాద్, బడే వెంకటేశ్వరరావు, చిల్లా సుబ్బారావు, సనకా శ్రీకాంత్, బడే పాండు లింగ ప్రసాద్, రేపల్లె శ్రీధర్ కమిటీగా ఏర్పడి 32 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన 16 మంది బాలురు, 16 మంది బాలికలు ఈ నెల 12, 13, 14 తేదీల్లో సత్యసాయి బాబా జిల్లా కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొంటారని సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో సీఐ ఈశ్వరరావు

ప్రతిభావంతులకు కొల్లిపర శివపార్వతి ట్రస్ట్ సత్కారం

చల్లపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొల్లిపర శివపార్వతి మెమోరియల్ ట్రస్ట్ శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం రాత్రి ప్రతిభావంతులను సత్కరించింది. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని నీట్‌లో ర్యాంకు మంచి ర్యాంకు సాధించిన వరదా రేష్మంత్, సీఎంఏలో 32వ ర్యాంకు సాధించిన వేముల హేమంత్ తల్లిదండ్రులను, ఒలింపియాడ్‌లో నాల్గో ర్యాంకు సాధించిన కొల్లిపర అక్షర, పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో కళాశాల, హైస్కూల్ స్థాయిలో ప్రథమ స్థాయిలో ఉత్తీర్ణులైన 17 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించి, అభినందించారు. మహిళా మండలి అధ్యక్షురాలు కొల్లిపర నళిని వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, ట్రస్ట్ ఛైర్మన్ కొల్లిపర మధు, వారి కుటుంబ సభ్యులు, చెన్నగిరి లక్ష్మీసుజాత పాల్గొన్నారు.



మచిలీపట్నంలో మూడో వార్డులో పర్యటిస్తున్న మంత్రి రవీంద్ర





పల్లెపాలెం, కొర్లపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత

పోర్టు, పరిశ్రమలతో యువతకు ఉపాధి

మచిలీపట్నం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేసి తీరుతామని, మచిలీపట్నాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. భాస్కరపురం, ఆనందపేట, మాచవరం తదితర ప్రాంతాల్లో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుతామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కొందరు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్ల సమస్యలను మంత్రి కొల్లు రవీంద్రకు వివరించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, ఐపీసీ కరుణకుమార్, పద్మనాభుని శేఖర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. హౌసింగ్ బోర్డులో మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు విస్తృతంగా ఇంటింటికీ పర్యటించారు. ఆ ప్రాంతంలో ప్రజలు రోడ్ల సమస్యలను దాసు దృష్టికి తీసుకుని వచ్చారు.

మచిలీపట్నంలో ఎనిమిది వేల బంగారు కుటుంబాలు

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎనిమిది వేల బంగారు కుటుంబాలను గుర్తించామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం రాత్రి మూడో డివిజన్ సచివాలయంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ దాతల సహకారంతో మెరుగైన జీవితాన్ని అందిస్తామన్నారు. రేల్లుగోల్లు పరిశ్రమతో పాటు ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షుడు వెంకటస్వామి, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి : పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో కొర్లపాడు గ్రామంలో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆదివారం పాల్గొని ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రైతులు సాగు నీరు కావాలని కోరారు డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ, యిల్లూరి లీలా కృష్ణ, అల్లూరి రమేష్, సుధాకర్, యలవర్తి నాగరాజు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పల్లెపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదివారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడే, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఒడుగు తులసీరావు, పార్టీ కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, డీసీ ఛైర్మన్ నెక్కంటి భాస్కరరావు, నాయకులు కూనసాని చిన్న, నాగిడి చెన్నకేశవరావు, యాదంరెడ్డి కొండ, బస్వాని బంగార్రాజు, బొర్రా ఏడుకొండలు, చేకూరి వెంకట్రావు, నడకుదిటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి : బొబ్బా

మోపిదేవి : ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి విస్తృతంలోకి తీసుకెళ్లాలని టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ క్లస్టర్ బూత్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసిన మంచి గురించి తెలుగుదేశం నేతలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయటంతోపాటు ప్రజల ఆకాంక్షలు, వారి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని సంప్రదిస్తే సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు కర్రా సుధాకర్, రావి రత్నగిరి, నాదెళ్ల శరత్ చంద్ర, నడకుదురు శేషగిరి, రాజేష్ నాదెళ్ల, సనకా నగేష్, హనుమాన్, శివ రాజేష్, శివ నాగ బసవయ్య, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

మోపిదేవి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి పండుగను పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. కాశీభట్ల బాలకృష్ణ శర్మ నేతృత్వంలో 45 మంది వేదపండితులు అమ్మవారికి మహారుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన జరిపారు. ఆకుల వెంకట్రామయ్య, కెవిఎన్.కె.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ :** గీతా మందిరంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆదివారం వైభవంగా జరిగాయి. తమిరిశ ఆనంద కుమార్ వ్రతాలు జరుపగా, 30 మంది దంపతులు పాల్గొన్నారు. దర్మకర్త పోతరాజు భాస్కరావు - అన్నపూర్ణ దంపతులు ఉచితంగా పూజా సామాగ్రి అందించారు. ఈవో యార్లగడ్డ వాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **కోడూరు :** ఉల్లిపాలెం శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ, మూల విరాట్‌కు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అన్నసమారాధన చేశారు. ఆలయం వద్ద ఏర్పాట్లను త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.9.61 లక్షలు

మోపిదేవి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా, సేవా రుసుముల ద్వారా ఒక్కరోజులోనే రూ.9,61,721 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

హుండీల లెక్కింపు 9న

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగే లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తి గల భక్తులు డ్రస్‌కోడ్ నిబంధనలతో పాల్గొనాల్సిందిగా కోరారు. హుండీల లెక్కింపు సందర్భంగా 9వ తేదీన స్వామివారి నిత్య కల్యాణం ఉదయం 7 గంటలకు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

నర్సింగ్ ఆన్‌లైన్ పరీక్షకు 170 మంది హాజరు

పెడన రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 180 మందికి 170 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

పెడనలో స్పందన నేడు

పెడన రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయాల్సిందిగా కోరారు. సంబంధిత శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.



ఆషాఢ సారె తీసుకెళ్తున్న పెడన కాపులవీధి మహిళలు



నాగాయలంక కనకదుర్గమ్మకు..



చల్లపల్లిలో సంపటాలమ్మకు..

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

పెడన, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కాపుల వీధి మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి తొమ్మిది మంది అమ్మవార్లకు సారె సమర్పించారు. పైడమ్మ, శ్యామలాంబ, కన్యకా పరమేశ్వరిదేవి, పార్వతీదేవి, అమలేశ్వరిదేవి, రుక్మిణి, మహాలక్ష్మి, ముత్యాలమ్మ, మా రెమ్మ అమ్మవార్లకు మహిళలు భక్తిశ్రద్ధలతో సారెసమర్పించారు. మహిళలకు ఆయా ఆలయాల అర్చకులు సాదర స్వాగతం పలికి ప్రసాదాలు పంపిణీ చేశారు. సామూహిక ఆశీర్వాదం చేశారు. **కోడూరు :** కోడూరులో గంగానమ్మ అమ్మవారికి కాపుల కాలనీ వాసులు, తూర్పు వైపు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు.ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అమ్మవారు భక్తులకు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథపల్లిలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి తోట వంశీకులు ఆషాఢ సారెను సమర్పించారు. **అవనిగడ్డ రూరల్ :** వేకనూరులోని ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉషా అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరాదేవి దంపతులతోపాటు ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. **నాగాయలంక :** నాగాయలంకలోని పోతురాజు స్వామి, సబ్బినేని వారి ఎల్లారమ్మ తల్లి ఆలయాల నుంచి వందలాది భక్తులు ఆషాఢ సారెలను ఊరేగింపుగా తీసుకువచ్చి కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అర్చకులు ముదునూరి శ్రీనివాస శాస్త్రి, అచ్యుత శేఖరశర్మ బ్రహ్మత్వంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్, బోయపాటి రాము తదితరులు పర్యవేక్షించారు. **మోపిదేవి :** వెంకటాపురంలో మావిళ్లమ్మ, అన్నపూర్ణాదేవి, సీతాదేవి అమ్మవార్లకు మహిళలు పసుపు, కుంకుమలు, ఆషాఢ సారె సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. **చల్లపల్లి :** చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మ అమ్మవారికి పడమరవీధి మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు, కమిటీ సభ్యుడు విన్నకోట శంకర్, బొందలపాటి సూరిబాబు, నాగమల్లేశ్వరరావు మాస్టారు, సోమిశెట్టి సూరిబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** భద్రావతి సమేత భావనారుషి దేవస్థాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, ఆలయ కమిటీ ఛైర్మన్ అందె జగదీష్ గ్రామ దేవత పెన్నేరమ్మ తల్లికి, జలదీశ్వరస్వామి దేవస్థానంలో బాలపార్వతి, వేణుగోపాలస్వామి దేవాలయంలో రుక్మిణి, సత్యభామదేవి అమ్మవారికి, భద్రావతి దేవి, సర స్వతీ దేవిఏ అమ్మవారికి ఆషాఢసారె సమర్పించారు. ఆలయ ఛైర్మన్ అందె జగదీష్ దంపతులు, పాలక మండలి సభ్యులు వుడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, కొడాలి శ్రీకాంత్, మురుగు నాంచారయ్య, విట్టంశెట్టి సుధాకర్ పర్యవేక్షించారు.



కోడూరు గంగానమ్మకు...



వేకనూరులో ఉషా పద్మినిదేవికి...



ఘంటసాలలో భద్రావతి దేవికి..



వెంకటాపురంలో మావిళ్లమ్మకు..

చేనేత కార్మికురాలికి మేమున్నాం సాయం

పెడన, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం కప్పలదొడ్డికి చెందిన చేనేత కార్మికురాలు అంకెం భ్రమరాంబ గుండె వ్యాధితోనూ, పక్షవాతంతోనూ బాధపడుతోంది. భ్రమరాంబ దయనీయ పరిస్థితి గురించి సమాచారం అందుకున్న మేమున్నాం సేవా సంస్థ ఆదివారం సంఘ సేవకుడు పేరిశెట్టి నాగరవి చేతుల మీదుగా ఆమె కు రూ.10వేలు, నిత్యావసరాలు అందజేసింది. సంస్థ ఛైర్మన్ వీణం శ్రీనివాసరావు, సభ్యులు నల్లా సాయిబాబు, మేడక కిషోర్, పట్టిసపు పవన్, పిచ్చుక విజయ్ పాల్గొన్నారు.

అగ్నిబాధిత మహిళకు జనసేన ఆర్థిక సాయం

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో అగ్నిబాధిత మురాల లక్ష్మీకుమారికి జనసేన పార్టీ రూ.10వేల ఆర్థిక సాయం అందజేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్, జనసేన పార్టీ నాయకులు కనపర్తి వెంకన్న, సమ్మెట చిన్ని, మునగాల మార్కండేయులు, కారుపర్తి మల్లిబాబు, పిచ్చుక విజయుడు, కటకం వెంకన్న, కార్యకర్తలు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు.

అవనిగడ్డ, నాగాయలంకలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి

అవనిగడ్డ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కర్రా సుధాకర్ తదితరులు నివాళులర్పించారు. బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, మాచవరపు ఆదినారాయణ, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు, షేక్ బాబావలి, చెన్ను గాంధీ, మురాద్ బేగ్, విక్కుర్తి రాంబాబు, రామకృష్ణ, పులిగడ్డ చంద్ర పాల్గొన్నారు. **నాగాయలంక :** వర్ధంతిని పురస్కరించుకుని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నేతలు పూలమాలలు నివాళులర్పించారు. తానంకి పోతురాజు, కనగాల యోహాను, కె.అబ్రహం, కైతేపల్లి నీలమేఘం, గాజులేటి మధుబాబు, బందెల అశోక్ తదితరులు పాల్గొన్నారు.